సాక్షి నంద్యాల
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



గాడి తప్పిన పరీక్షల విభాగం!

ఆర్‌యూ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఈడీ పరీక్షల్లో ప్రశ్నాపత్రం తారుమారు సంఘటనకు కారకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలియడం లేదు. -8లో▶



వీనుల విందుగా..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన విశ్వాంజనేయ భజన మండలి వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.96
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.617
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 19,510
అవుట్ ఫ్లో	: 17,794

న్యూస్‌రీల్

డీఈఓ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): డీఈఓగా జనార్దన్‌రెడ్డి శనివారం బాధ్యతల స్వీకరించారు. కర్నూలు డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకునిగా పని చేస్తున్న జనార్దన్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన డీఈఓను ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్సార్బీసీ గండి పూడ్చివేత

- నేటి నుంచి కాల్వకు నీటి విడుదల


ఎస్సార్బీసీ గండిని పూడ్చివేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలోని శ్రీశైలం కుడిగట్టు కాల్వ(ఎస్సార్బీసీ) 10వ బ్లాక్ కాల్వకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన అధికారులు పూడ్చివేశారు. ఇటీవల కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో కోవెలకుంట్ల–గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారికి 200 మీటర్ల దూరంలో కాల్వకు గండి పడిన విషయం తెలిసిందే. మట్టి కట్ట, ఇసుక బస్తాలతో చేపట్టిన తాత్కాలిక పనులు శనివారం పూర్తయ్యాయి. ఈసందర్భంగా ఎస్సార్బీసీ ఏఈ సురేంద్రకుమార్ మాట్లాడుతూ రూ.2లక్షలతో కాల్వకు పడిన గండిని తాత్కాలికంగా పూడ్చామని, వేసవికాలంలో ఈ ప్రాంతంలో శాశ్వత పనులు చేపడతామని తెలిపారు. ఆదివారం నుంచి కాల్వకు యథావిధిగా నీటి విడుదల కొనసాగుతుందని, రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ


మాట్లాడుతున్న మురళీకృష్ణ

కోవెలకుంట్ల: వికసిత్ ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025 ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు రైతు విశ్రాంతి భవనంలో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల వ్యవసాయశాఖ సిబ్బందికి శనివారం ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారితోపాటు కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్త సుధాకర్, జిల్లా కేంద్రం నుంచి వ్యవసాయాధికారులు చంద్ర, జ్యోతి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తక్కువ కాలపరిమితి పంటలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పప్పుశనగ స్థానంలో తక్కువ పెట్టుబడితో ఇతర పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సూచనలివ్వాలన్నారు. రాష్ట్ర, రైతుల ఆదాయం పెరిగే విధంగా గ్రామస్థాయి నుంచే యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రోడ్డు ఏర్పాటుకు డీపీఆర్

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల జంక్షన్ నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు రోడ్డు నిర్మించేందుకు డీపీఆర్ తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈరోడ్డును పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)విధానంలో ఏర్పాటు చేయనున్నారు. కొలిమిగుండ్ల నుంచి జమ్మలమడుగు వరకు 42 కి.మీ దూరం ఉంది. డీపీఆర్ సిద్ధం చేసేందుకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసినట్లు తెలుస్తోంది. రోడ్డు విస్తరణం పూర్తయితే వాహనదారులకు ఊరట లభించనుంది.

డిగ్రీ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ సప్లిమెంటరీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన రీ వాల్యుయేషన్ ఫలితాలను వర్సిటీ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఫలితాలను https:// rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపారు. రెండవ సెమిస్టర్ రీ వాల్యుయేషన్‌కు సంబంధించి1068 మందికి 214, 4వ సెమిస్టర్‌లో 1866 మందికి 460 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

దర్యాప్తుకో దండం!

అన్నెంపుణ్యం ఎరుగని చిన్నారిని కొందరు చిదిమేశారు.. మరికొందరు మృతదేహాన్ని కూడా దక్కకుండా మాయం చేశారు. సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు శిక్ష పడేలా చూడాల్సిన పోలీసులు సైతం చేతులెత్తేశారు. తూతూమంత్రంగా దర్యాప్తు పూర్తి చేసి ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలుతో చేతులు దులిపేసుకున్నారు. ఇక బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్న ఆరుగురి నిందితుల్లో కోర్టు కూడా ఐదుగురికి బెయిల్ మంజూరు చేసింది. బలమైన సాక్ష్యాధారాలు లేకపోతే కేసు కూడా నిలవదని న్యాయ నిపుణులు చెబుతూ ఉంటే బాధిత కుటుంబం నిశ్చేష్టులై చూస్తోంది. తమ కూతురిని కర్కషంగా చంపిన వారికి శిక్ష పడితే గుండెల్లో బాధ కొంతైనా తగ్గుందని భావించిన ఆ తల్లిదండ్రులు బేల చూపు చూస్తున్నారు.


ఘటనా స్థలం వద్ద డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్)

- ముచ్చుమర్రి ఘటనలో సాక్ష్యాధారాల సేకరణలో పోలీసుల వైఫల్యం
- నేటికీ లభించని చిన్నారి మృతదేహం
- దర్యాప్తు పూర్తి.. ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలు.. బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్న నిందితులు
- ఆరుగురిలో ఐదుగురికి బెయిల్ మంజూరు
- నిశ్చేష్టులైన బాధిత కుటుంబం

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో నేరాలు పెరిగిపోతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలోనే చిన్నారులు, మహిళలపై వేధింపులు తీవ్రమయ్యాయి. రోజూ ఏదో ఒక ప్రాంతంలో నేరం జరుగుతూనే ఉంది. నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉండడంతోనే క్రైం రేట్ పెరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముచ్చుమర్రిలో బాలిక హత్యాచారం ఘటనలోనూ కూటమి ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నేరం జరిగి వంద రోజులైనా నేటికీ చిన్నారి మృతదేహాన్ని కనుగొనలేకపోవడం పోలీసుల వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలు

జులై 7న ముచ్చుమర్రి గ్రామంలో ముగ్గురు మైనర్లు తొమ్మిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి ఆపై చంపేసిన ఘటన కలకలం రేపింది. ఈ కేసులో ప్రాథమిక దర్యాప్తును పోలీసులు పూర్తి చేసి కోర్టులో ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం జరిగి 90 రోజులు గడవడంతో నిందితులంతా బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం ఆరుగురు నిందితుల్లో సీసీఎ1 మినహా మిగిలిన ఐదుగురికి బెయిల్ మంజూరు చేసింది.

అడుగడుగునా నిర్లక్ష్యం

నేరం జరిగిన తర్వాత మొదటి 24 గంటలు కీలకం. క్రైం సీన్‌ను ఎవరూ మార్చకుండా ఉన్నప్పుడే నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడే అవకాశం ఉంటుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. బాలిక అదృశ్యమైందని జులై 7న ఫిర్యాదు చేస్తే పోలీసులు రెండు రోజుల తర్వాత దర్యాప్తు చేపట్టారు. దీంతో బలమైన సాక్ష్యాధారాలను నేటికీ సేకరించలేకపోయారు. నేరం జరిగిన తర్వాత మృతదేహాన్ని కనిపెట్టాలి. అప్పుడే నిందితులపై మోపిన అభియోగాలను నిరూపించే చేసే అవకాశం ఉంటుంది. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యంతో చిన్నారి శవాన్ని నేటికీ కనుగొనలేకపోయారు. దీంతో కేస్ తీవ్రత బాగా తగ్గిపోయిందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. బాలికను అత్యాచారం చేసి ఆపై గొంతు నులిపి చంపినట్లు నిందితులపై అభియోగాలు మోపినట్లు సమాచారం. బాలిక మృతదేహం లభ్యమైతే పోస్టుమార్టం నిర్వహించి ఉండేవారు. ఫోరెన్సిక్ వైద్యులు ఇచ్చిన రిపోర్టు కేసుకు బలాన్ని ఇచ్చేది. కానీ, ఇక్కడ అసలు మృతదేహమే లేనప్పుడు ఇక అత్యాచారం చేసినట్లు, ఆపై చంపేసినట్లు నేరాన్ని నిర్ధారించడం దాదాపు అసంభవమని న్యాయనిపుణులు చెబుతున్నారు. పైగా ఈ కేసులో పోలీసులు నిందితుల వాగ్మూలం మేరకే దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరం చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దీన్ని బేస్ చేసుకునే పోలీసులు ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.


మృతదేహం కోసం శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో గాలిస్తున్న పోలీసులు(ఫైల్)

ఆ వీడియో ఏమైంది?

చిన్నారిపై అఘాయిత్యం చేస్తున్న సమయంలో మొబైల్‌లో ఆ దృశ్యాలను వీడియో తీసినట్లు పోలీసులు చెప్పారు. అయితే తమ వద్దకు వచ్చే సరికి మొబైల్‌లో ఆ వీడియోలు లేవని, వాటిని రికవరీ చేయాలని రీజినల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. మొబైల్‌ను చెక్ చేసిన తర్వాత అలాంటి వీడియో మొబైల్‌లో లేదని ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చినట్లు తెలుస్తోంది. సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించి నివేదికలో పొందుపరచడంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఉంటే నిందితులకు కఠిన శిక్ష పడేదని, స్థానిక టీడీపీ నాయకులు తమ అధికార దర్పంతో నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నిందితుల్లో ఒకరి మృతి

బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో ఏడుగురి నిందితులపై పోలీసులు అభియోగాలు మోపారు. బాలికను ముగ్గురు మైనర్లు రేప్ చేసి చంపేసిన తర్వాత శవాన్ని మాయం చేయడానికి మరో నలుగురు సాయం చేశారు. విచారణ పేరుతో అంబటి హుస్సేన్ అలియాస్ యోహాన్(36)ను జిల్లా పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. అదుపులోకి తీసుకుని మిడుతూరు, జూపాడుబంగ్లా పోలీస్‌స్టేషన్లలో ఇష్టమొచ్చినట్లు కొట్టారు. పోలీసుల దెబ్బలకు తాళలేక జూలై 20వ తేదీ మృతి చెందాడు.

మద్దిలేస్వామికి రూ.3,35,886 ఆదాయం


భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య క్షేత్రం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రం లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ సేవల ద్వారా రూ.3,35,866 స్వామి, అమ్మవార్లకు సమర్పించుకున్నారని ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

ప్రబలిన అతిసారం


మండల పరిషత్ కార్యాలయం వద్ద బోరు మోటారును పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల కేంద్రంలో డయేరియా కలకలం రేగింది. దళిత కాలనీలో ఒకరు, చంద్రునిపేటలో మరొకరు డయేరియా బారిన పడ్డారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్సలు అందించగా కోలుకున్నట్లు ఆయా కాలనీ వాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ రవికుమార్ శనివారం రుద్రవరం చేరుకుని తాగు నీరు సరఫరా చేసే బోరు మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆరు మోటార్లు ఉన్నాయని, వాటిలో కొన్నింటి నుంచి నేరుగా నీరు సరఫరా అవుతున్నాయన్నారు. బోరు మోటార్ల నుంచి నీటిని ట్యాంకులకు చేర్చి క్లోరినేషన్ చేశాక వదలాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించామన్నారు. మండల పరిషత్ కార్యాలయ బోరు మోటారు వద్ద లీకేజీ లేకుండా పైపులను మార్చాలని, బోరు మోటారుకున్న సూపర్ పట్టను తొలగించాలని ఈఓ సుబ్బరావుకు సూచించారు. వారి వెంట ఏఈలు సుబ్రహ్మణ్యం, ప్రమోద్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో - ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన, ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, గంగుల నాని, శ్రీదేవి తదితరులు

అధికార పార్టీ ఆగడాలను దీటుగా ఎదుర్కొందాం

- కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసింది
- ఎన్నికల హామీల అమలుకు ప్రజల తరఫున పోరాడుదాం
- జిల్లా స్థాయిలో 28 అనుబంధ కమిటీలకు అధ్యక్షుల నియామకం
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల రీజినల్ కో– ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కర్నూలు (టౌన్): అధికార పార్టీ ఆగడాలను దీటుగా ఎదుర్కొందామని వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల జిల్లా వైస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని స్వగృహంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్యలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. 'కార్యకర్తలే పార్టీకి బలమని, వారికి అన్ని విధాలుగా అండగా నిలబడాలని పెద్దిరెడ్డి సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందని చెప్పారు. ఈ సమయంలో ప్రజలకు అండగా నిలబడి వారి తరఫున పోరాడాలని నాయకులకు పిలుపునిచ్చారు. జిల్లా, మండల, కార్పొరేషన్, మున్సిపాల్టీ స్థాయిలో పార్టీని 4 క్లస్టర్లుగా చేసి 28 అనుబంధ కమిటీలు ఏర్పాటు చేసి అధ్యక్షులను నియమిస్తున్నట్లు చెప్పారు. కమిటీ నాయకులుగా ఉన్న కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అత్యంత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అలాగే త్వరలోనే మండల, నియోజకవర్గ స్థాయిలో కమిటీ నాయకులను ఎన్నుకుని పార్టీని పటిష్ట పరచనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి (మంత్రాలయం) విరూపాక్షి (ఆలూరు), పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, నాయకులు ఇంతియాజ్, బుట్టారేణుకా, జగన్‌మోహన్ రెడ్డి, కంగాటీ శ్రీదేవి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్, బీవై.రామయ్య, నంద్యాల నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కాటసాని రామిరెడ్డి, దారా సుధీర్, గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల బిజేంద్రానాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇసుక, లిక్కర్ మాఫియా రెచ్చిపోతోంది

కూటమి పాలనలో ఇసుక, లిక్కర్ మాఫియా రెచ్చిపోతోందని, అధికారపార్టీ నాయకులు బహిరంగంగా పర్సంటేజీలు మాట్లాడుకుంటున్నారని వైఎస్ ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నివాసంలో పార్టీ ముఖ్యల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ 100 రోజుల పాలన పట్ల ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతి పనిలో పర్సంటేజీలు తీసుకుంటున్నారన్నారు. ఈ సమయంలో ప్రజలకు అండగా నిలబడి అధికార టీడీపీ నేతల తీరును ఎండగడదామన్నారు.

విద్యార్థులను ఆకట్టుకున్న పోలీసు ఓపెన్ హౌస్


ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


పోలీసు జాగిలం హనీ మార్షల్ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

నంద్యాల(సిటీ): పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన పోలీసు ఓపెన్ హౌస్ విద్యార్థులను ఆకట్టుకుంది. పోలీసు విధులు, వారు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, శాంతిభద్రతల నిర్వహణపై విద్యార్థులకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అవగాహన కల్పించారు. ఆయుధాలు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో పోలీసులు ఉపయోగిస్తారన్న విషయాలను వివరించారు. పోలీసులకు జాగిలాలు ఎలా ఉపయోగపడతాయో, పేలుడు పదార్థాలను ఎలా గుర్తిస్తాయో చూపించారు. 410 డీపీ మస్కట్, 7.62ఎంఎం బోల్ట్ యాక్షన్ రైఫిల్, 7.62 ఎంఎం ఎస్‌ఎల్‌ఆర్, 7.62 ఎంఎం ఏకే 47 రైఫిల్, 9 ఎంఎం కార్బన్, 9 ఎంఎం పిస్టల్, వీఎల్ పిస్టల్, 16 ఎంఎం పీపీటీ, ఫెడరల్ గ్యాస్ గన్, టియర్ స్మోక్ గ్రనేడ్స్, టియర్‌స్మోక్ షెల్, 303 రైఫిల్, ఫైబర్ లాఠీ, హెల్మెట్ స్టోన్ గార్డ్, బాడీ ప్రొటెక్టర్, పోలీసు వైర్‌లెస్ కమ్యూనికేషన్, ట్రాఫిక్ పోలీసులు వాడే పరికరాలు, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్, డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ తదితర పరికరాలను ప్రదర్శనలో ఉంచి వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పోలీసు జాగిలం హనీ మార్షల్ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిసరఫరాను తగ్గించిన అధికారులు శనివారం సాయంత్రానికి 28 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పోతిరెడ్డిపాడు దిగువన ఉన్న ఎస్సార్బీసీ, తెలుగుగంగ కాల్వల కిందున్న రిజర్వాయర్లు గరిష్ఠస్థాయి నీటిమట్టంతో ఉండటంతోపాటు అధికవర్షాల వల్ల పోతిరెడ్డిపాడు నుంచి నీటి సరఫరాను తగ్గించినట్లు తెలిపారు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో శ్రీశైలం జలాశయంలో 884.80 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 883.80 అడుగుల నీటి మట్టం నమోదైనట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఆరుగేట్ల ద్వారా 28వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 14వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 12 వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 2వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

9న శ్రీశైలంలో సీఎం పర్యటన?

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజకుమారి


పాతాళగంగ వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

శ్రీశైలంటెంపుల్: నవంబరు 9న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీశైలం రానున్నట్లు సమాచారం. సీఎం పర్యటన నేపథ్యంలో ఆయా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పరిశీలించారు. శనివారం శ్రీశైలం చేరుకున్న జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పాతాళగంగ వద్ద ఎయిర్ డ్రోమ్ ల్యాండ్ అయ్యే బోటింగ్ పాయింట్‌ను పరిశీలించారు. రోప్‌వే, పాతాళగంగ నీటి నిల్వలు, బోటింగ్, పాతాళగంగ వద్ద జెట్టి తదితర ప్రదేశాలతోపాటు ఆలయాన్ని సందర్శించారు. నవంబరు రెండు, మూడు వారాల్లో సీ ప్లేన్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉందని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోప్‌వే పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ జెట్టి ఏర్పాటుతోపాటు ల్యాడర్‌కు డెకరేషన్ చేయాలన్నారు. రోప్‌వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ వెంట ఆత్మకూరు ఆర్డీఓ ఎం.దాసు, డీఎఫ్ఓ సాయిబాబా, డ్యాం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి, దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

రేపు వినికిడి సమస్య ఉన్న వారికి వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నెం 43లోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవుడు నివారణ, నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం (ఎన్‌పీపీసీడీ)లో భాగంగా దీన్‌దయాల్ శ్రావణ ఫౌండేషన్ ద్వారా ఉచిత ప్రోగ్రామబుల్ హియరింగ్ హెడ్స్ పంపిణీ కోసం ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపునకు వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, గతంలో వినికిడి పరీక్ష చేయించుకున్నవారు ఆడియోగ్రాఫ్ రిపోర్ట్ తప్పక తీసుకురావాలని సూచించారు. వివరాలకు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం మేనేజర్ ఇర్ఫాన్(08518–251043)ను సంప్రదించాలన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. శనివారం 29,380 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఇందులో 2,445 క్యూసెక్కులు కేసీ కాలువకు, 6 గేట్లు పైకెత్తి 26,070 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నాగిరెడ్డి (ఫైల్‌)

ఆదోని అర్బన్‌: నెట్టేకల్‌ గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ ఢీ కొని అదే గ్రామానికి చెందిన నాగిరెడ్డి(45) శనివారం అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతను తోపుడుబండి తీసుకుని పొలం పనులకు వెళ్తుండగా వెనక నుంచి ట్రాక్టర్‌ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో నాగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని జనరల్‌ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

గల్లంతైన బాలుడు శవమై తేలాడు

దేవనకొండ: హంద్రీనీవా కాలువలో శుక్రవారం గల్లంతైన ఆరేళ్ల బాలుడు శవమై తేలాడు. తల్లిదండ్రులకు విషాదం నింపిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. మండలంలోని అలారుదిన్నె గ్రామానికి చెందిన ఆవుల నరసన్న, సోమేశ్వరి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు మహేష్‌(6) ఉన్నాడు. శుక్రవారం ఆ దంపతులు పొలం పనులకు వెళ్తూ వెంట బాబును తీసుకెళ్లారు. పొలానికి సమీపంలోనే హంద్రీనీవా కాలువ ప్రవహిస్తుంది. తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా బాలుడు ఆడుకుంటూ కాలువ వద్దకు వెళ్లి అందులో పడిపోయాడు. ఆలస్యంగా గమనించిన తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం అదే కాలువలో బాలుడి మృతదేహం కనిపించడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ముగిసిన జిల్లా స్థాయి ఫెన్సింగ్‌ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్‌): స్థానిక డిస్ట్రిక్ట్‌ స్పోర్ట్స్‌ అథారిటీ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన అండర్‌–19 బాలబాలికల ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఫెన్సింగ్‌ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, డీవీఈఓ సునిత, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ గౌరవాధ్యక్షులు సుధాకర్‌, రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు, వ్యాయమ ఉపాధ్యాయుడు రవికుమార్‌, గోపికృష్ణనాయక్‌, భరత్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందక గర్భిణి మృతి

చాగలమర్రి: కడపలోని రిమ్స్‌ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ఓ నిండు గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని కదిరిపురం తండాకు చెందిన శ్యామలబాయి(23) రెండో కాన్పు నిమిత్తం ఈనెల 23న కడప రిమ్స్‌లో చేరింది. శుక్రవారం కాన్పు కాక ముందే మృతిచెందింది. కాగా ఫిట్స్‌ వచ్చి ఉమ్మనీరు గుండెను తాకడంతో గర్భిణి మృతి చెందిందని వైద్యులు చెబుతుండగా.. వైద్యుల నిర్లక్ష్యంతోనే శ్యామలాబాయి మృతిచెందిందని కుటుంబ సభ్యులు వాపోయారు.

రాగి తీగ దొంగల అరెస్టు

నంద్యాల(సిటీ): రైతుల వ్యవసాయ భూముల్లో నీటి సరఫరాకు వినియోగించే విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో రాగి తీగలను చోరీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలు.. కొన్ని రోజులుగా నంద్యాల పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ విద్యుత్‌ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. పలువురు రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో శనివారం ఎస్సార్బీసీ కాలనీలో టిడ్కో గృహాల వద్ద ఉన్న కంపచెట్లలో ఆసిఫ్‌, మల్లికార్జున, బోయ శివలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 20 కేజీల కాల్చిన రాగి తీగను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాడి తప్పిన ఆర్‌యూ పరీక్షల విభాగం!

- ఈ నెల 24న బీఈడీ పరీక్ష ప్రశ్నాపత్రం తారుమారు
- ఒక పరీక్షకు బదులు మరో పరీక్ష ప్రశ్నపత్రం అందజేత
- ఎస్పీవై రెడ్డి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఘటన
- కారకులపై చర్యలు తీసుకోకుండా వదిలేసిన వర్సిటీ ఉన్నతాధికారులు



కర్నూలు కల్చరల్‌: రాయలసీమ వర్సిటీ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఈడీ మొదటి సెమిస్టర్‌ పరీక్షల్లో ప్రశ్నాపత్రం తారుమారై పరీక్షను వాయిదా వేసినప్పటికీ దానికి కారణమైన పరీక్షల విభాగం అధికారులపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. కేవలం పరీక్ష కేంద్రాన్ని మార్చి చేతులు దులుపుకున్నారు. ఈనెల 23 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 17 కేంద్రాల్లో ఆర్‌యూ బీఈడీ మొదటి సెమిస్టర్‌ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే, నంద్యాల పట్టణంలోని ఎస్పీవై రెడ్డి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఈనెల 24వ తేదీన పర్‌స్పెక్టివ్‌ ఇన్‌ ఛైల్డ్‌ డెవలప్‌మెంట్‌ ప్రశ్నా పత్రం స్థానంలో 25వ తేదీ ఉన్న ఇన్ఫర్మేషన్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌ టెక్నాలజీ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. దీంతో గందరగోళం తలెత్తడంతో అధికారులు ఆ ప్రశ్నాపత్రాన్ని వెనక్కి తీసుకుని పర్‌స్పెక్టివ్‌ ఇన్‌ ఛైల్డ్‌ డెవలప్‌మెంట్‌ పరీక్ష పత్రం ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా మరుసటి రోజు (25వ తేది)జరగాల్సిన పరీక్షపై విద్యార్థులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటికప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాయిదా వేశారు. ఈ విషయం పరీక్ష కేంద్రాలకు చేరుకున్న తర్వాత తెలియడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పరీక్షను వాయిదా వేయకుండా అదే రోజు పరీక్షను నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ పరీక్షల విభాగం ఉన్నతాధికారి నిర్లక్ష్యంతోనే పరీక్ష నిర్వహించలేకపోయారని బీఈడీ కళాశాలల యాజమాన్యాల సంఘం నాయకులు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌ కంటే మరో రోజు పెరగడంతో సుమారు 4500 మంది విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. వర్సిటీకి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నా.. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో తీవ్ర జాప్యం జరిగి విద్యార్థులు నష్టపోతున్నా వర్సిటీ ఉన్నతాధికారులు పరీక్షల విభాగాన్ని గాడిలో పెట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పరీక్ష ప్రశ్నా పత్రం మార్పుపై కూడా ఎలాంటి ప్రక్షాళన కానీ, చర్యలు కానీ తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ప్రశ్నాపత్రం తారుమారు అయిన పరీక్షా కేంద్రాన్ని మార్చి చేతులు దులుపుకున్నారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్‌ నుంచి వివరణ కోరి విచారణ చేపడతామని వర్సిటీ అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం గమనార్హం. నంద్యాలలో రెండు మూడు ప్రముఖ అటానమస్‌ కళాశాలలు ఉన్నప్పటికీ వాటిని కాదని ఎస్పీవై రెడ్డి కళాశాల కేంద్రాన్ని కేటాయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నంద్యాలలోని బీఈడీ కళాశాల నిర్వాహకులు ఎస్పీవై రెడ్డి కళాశాలలో తమ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా వర్సిటీలోని ప్రరీక్షల విభాగంలోని కీలక అధికారితో లోపాయకారి ఒప్పందం చేసుకోవడంతో ఆ కళాశాలకు పరీక్ష కేంద్రంగా అనుమతి ఇచ్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మౌర్య హాస్పిటల్‌ ప్రారంభం



దేవనగర్‌లో మౌర్య హాస్పిటల్‌ ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కర్నూలు(హాస్పిటల్‌): నగరంలోని దేవనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మౌర్య హాస్పిటల్‌ను శనివారం రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ ప్రారంభించారు. తర్వాత ఆసుపత్రిలోని పలు విభాగాలను మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్‌ రాఘవేంద్ర రెడ్డి, ఐఎంఏ కర్నూలు అధ్యక్షుడు డాక్టర్‌ రామచంద్రనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్లు డాక్టర్‌ రాజేష్‌కుమార్‌, డాక్టర్‌ హరిప్రసాద్‌, డాక్టర్‌ వసీం హసన్‌రాజా, డాక్టర్‌ రఘుప్రవీణ్‌ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్‌, జనరల్‌ సర్జరీ, జనరల్‌ మెడిసిన్‌, గైనకాలజీ, సైకియాట్రి (మానసిక వ్యాధులు)లకు చికిత్స అందిస్తామన్నారు. ఊబకాయం తగ్గించేందుకు, మానసిక వ్యాధులకు అత్యాధునిక పరికరాలు, వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా అథ్లెటిక్స్‌ పోటీలు



బాలుర విభాగంలో ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను సాధించిన కర్నూలు క్రీడాకారులు

- బాలుర విభాగంలో ఓవరాల్‌ చాంపియన్‌ కర్నూలు
- బాలికల విభాగంలో విజయనగరం

కర్నూలు (టౌన్‌): రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ ఔట్‌డోర్‌ స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు, బాలికల విభాగంలో విజయనగరం ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను సాధించాయి. జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో అండర్‌– 19 విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 900 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు (ప్రథమ స్థానం), శ్రీకాకుళం (ద్వితీయ స్థానం), తూర్పు గోదావరి (తృతీయ స్థానం), బాలికల విభాగంలో విజయనగరం (ప్రథమ స్థానం), విశాఖపట్నం (ద్వితీయ స్థానం), శ్రీకాకుళం (తృతీయ స్థానం) నిలిచాయి. బాలుర విభాగంలో టోర్నమెంట్‌ బెస్ట్‌ అథ్లెట్‌గా ఎస్‌.వెంకటేష్‌ (కర్నూలు), బాలికల విభాగంలో విశాఖపట్నంకు చెందిన త్రిష నిలిచారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ అందజేశారు. 100 మీటర్ల పరుగులో గెలుపొందిన క్రీడాకారులకు రూ.1000 చొప్పున వ్యక్తిగత ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవీఈఓ పరమేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి, జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ సుంకన్న, కేవీఆర్‌ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ లాలప్ప, స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ క్రీడల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్‌ బాబు పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ భవిష్యత్తులో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలన్నారు. అండర్‌–19 స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి హర్షవర్దన్‌ మాట్లాడుతూ బాలికల, బాలుర విభాగాల్లో మొదటి, రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీలు ఓబన్న, లక్ష్మయ్య, శ్రీను, రాజశేఖర్‌, బాషా, మాలిక్‌, రాము, రమేష్‌ పాల్గొన్నారు.



స్టేడియంలో పరుగు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



అథ్లెటిక్స్‌ పోటీల్లో ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను సాధించిన విజయనగరం క్రీడాకారులు

ప్రజాసమస్యలపై ఉద్యమిద్దాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడదాం
- పార్టీశ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ నేత రామచంద్రయ్య

ఓర్వకల్లు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం ఓర్వకల్లు ఎయిర్‌ పోర్టు సమీపంలోని ఓ హోటల్‌లో రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే తరగతులకు తొలి రోజు రామచంద్రయ్యతో పాటు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్నారన్నారు. యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ సర్కారు హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని, ప్రజల తరఫున పోరాడే వారిపై దాడులు చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ కూటమి సర్కారు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటినా నియంత్రించడం లేదన్నారు. ఎన్నికల హామీలు కూడా అమలు చేయడం లేదన్నారు. వీటి సాధనకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్‌, మహేష్‌, శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు కుమార్‌, బీసన్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, మండల కార్యదర్శి రమేష్‌, కర్నూలు రూరల్‌ మండల కార్యదర్శి సురేంద్రయాదవ్‌, విద్యార్థి సంఘం నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో లొంగిపోయిన భార్య?

ఆత్మకూరు రూరల్‌: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో శుక్రవారం ఆదినారాయణరెడ్డి దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ప్రధాన నిందితురాలిగా అనుమానిస్తున్న మృతుడి భార్య చిట్యాల లక్ష్మిదేవి శనివారం ఆత్మకూరు పోలీసుల ఎదుట లొంగి పోయినట్లు సమాచారం. మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక హత్య చేసినట్లు తెలుస్తోంది. కాగా లక్ష్మిదేవిని ఆత్మకూరు అర్బన్‌ పోలీసులు ఇంతవరకు అరెస్టు చూపలేదు. మరోవైపు ఆదినారాయణరెడ్డి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ ఓబులేసు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన సిద్ధయ్య

డోన్‌ రూరల్‌: మండల పరిధిలోని కొత్తకోట గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధయ్య(48) మృతి చెందాడు. రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొరపాడు గ్రామానికి చెందిన సిద్ధయ్య.. బంధువులతో కలిసి బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్‌ రంగాపురం గ్రామ సమీపంలోని మద్దిలేటి స్వామికి శుక్రవారం రాత్రి బొలెరో బయలుదేరారు. కొత్తకోట గ్రామం వద్ద వాహనం నిలిపి టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా సిద్ధయ్యను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయడిన సిద్ధయ్యను బంధువులు డోన్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

నంద్యాల(సిటీ): స్థానిక బాలికోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని రేణుక ఆత్మహత్యకు యత్నించింది. హాస్పిటల్‌ ఔట్‌ పోస్ట్‌ పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్‌కు చెందిన రేణుక 3వ పట్టణ పోలీసు స్టేషను సమీపంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటూ బాలికోన్నత పాఠశాలలో చదువుతోంది. తోటి విద్యార్థినితో మనస్పర్థల కారణంగా హాస్టల్‌లో ఉదయం రసాయన ద్రావణం తాగి పాఠశాలకు వెళ్లింది. అక్కడ అపస్మారక స్థితిలో పడిపోవడంతో పాఠశాల సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆర్‌ఎంపీ దారుణ హత్య



కొండయ్య(ఫైల్‌)

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన ఆర్‌ఎంపీ కొండయ్య(40) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. అవుకు మండలం సుంకేసులకు చెందిన ఆర్‌ఎంపీ కొండయ్య 15 ఏళ్ల నుంచి బెలుంలో స్థిరపడ్డాడు. భార్య వెంకటేశ్వరి రామాపురం గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. అనంతపురం జిల్లా రాయలచెరువు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బెలుం శింగవరం సమీపంలోని కాల్వ సమీపంలో తోటను సాగు చేస్తూ సమీపంలోని రాళ్లగుట్టలపై తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటున్నారు. ఆరోగ్యం బాగోలేదని వారి నుంచి పిలుపు రావడంతో ఈనెల 24న బైక్‌పై కొండయ్య వెళ్లాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం బెలుం శింగవరం సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వలో మృతదేహం కొట్టుకుపోతుండటాన్ని నాపరాతి గనిలో పని చేసే కార్మికులు గమనించి సమాచారం ఇవ్వడంతో స్థానికులు, బంధువులు కాల్వ వెంట గాలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం, కాల్వలో దిగేందుకు అనుకూలంగా లేకపోవడంతో ఫలితం లేకపోయింది. చివరకు సంజామల మండలం రామిరెడ్డిపల్లె సమీపంలో కొట్టుకుపోతున్న కొండయ్య మృతదేహాన్ని యువకులు తాళ్ల సాయంతో కాల్వలో దిగి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్‌, సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తామే హత్య చేసి కాల్వలో పడిసినట్లు వృద్ధ దంపతులు అంగీకరించినట్లు సమాచారం.

గోనెగండ్లలో మూగజీవాలపై దాడి



ఎద్దుకు కుట్లు వేస్తున్న పశువైద్యులు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో మూగజీవాలపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. శుక్రవారం రాత్రి లక్ష్మీపేట, కిందిగేరి, గద్వాలగేరిలో ఇళ్ల ముందు తాళ్లతో కట్టేసి ఉంచిన ఆవులు, గేదెలు, పొట్టేళ్లను కత్తులతో పొడిచారు. ఉదయం వాటి యజమానులు గమనించి స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. దాదాపు పది మూగజీవాలపై కత్తులతో దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. తర్వాత వారు ఈ ఘటనకు పాల్పడిన వారిని పట్టుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి కల్పిస్తామని రూ. 16 లక్షలు టోకరా

ఆదోని అర్బన్‌: ఇంట్లోనే కూర్చొని డబ్బు సంపాదించవచ్చని ఓ యువకుడిని నమ్మించి సైబర్‌ నేరగాళ్లు రూ. 16 లక్షలు మోసం చేశారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు శనివారం ఆదోని టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ సూర్యమోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు..పట్టణంలోని ఎస్కేడీ కాలనీకి చెందిన అనిరుధ్‌ అనే యువకుడు ఆన్‌లైన్‌లో టెలిగ్రామ్‌ గ్రూపు ద్వారా అనామిక, రవిచంద్ర ఐడీ గల లింకులను ఓపెన్‌ చేశాడు. అందులో ఇంట్లోనే ఉంటూ ఇన్వెస్ట్‌మెంట్‌ చేసి డబ్బులు సంపాదించుకోవచ్చని, డ్రీమ్‌ హోటల్‌ ఆర్డర్‌ అనే పేరుతో దేశంలో ఎక్కడైనా హోటళ్లలో గదులు బుక్‌ చేసి ముందుగా అద్దె చెల్లిస్తే కమీషన్‌ ఇస్తామని ఎరవేశారు. తొలుత రూ.35 వేల పెట్టుబడికి రూ. 7 వేలు కమిషన్‌ కలిపి ఇచ్చారు. నమ్మిన యువకుడు గత మార్చి 28వ తేది సైబర్‌ నేరగాళ్ల ఖాతాలకు రూ. 16 లక్షలు పంపించాడు. తర్వాత కమీషన్‌ పంపకపోగా నేడు, రేపు అంటూ కాలయాపన చేయడంతో బాధితుడు శనివారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఆన్‌లైన్‌ మోసంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దొంగల అరెస్ట్‌

ఎమ్మిగనూరురూరల్‌: పట్టణంలో గత ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో ముగ్గురు దొంగలను అరెస్ట్‌ చేసినట్లు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని అమృత బార్‌ అండ్‌ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న మిన్నప్ప ఈ ఏడాది ఫిబ్రవరి–6వ తేదీ రాత్రి డ్యూటీ చేసుకుని ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో శిల్పా ఎస్టేట్‌ దాటిన తర్వాత సోమప్ప నగర్‌ దారిలో రాత్రి 11 గంటల ప్రాంతంలో పట్టణానికి చెందిన బోయ దేవేంద్ర అలియాస్‌ బుడ్డా, పిలిగోపి సురేష్‌ అలియాస్‌ బిగిశ్‌, బోయ సూరి అనే ముగ్గురు వ్యక్తులు కళ్లలో కారం కొట్టి డబ్బు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారి దగ్గర నుంచి రూ. 1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

బాలుని అప్పగింత

కర్నూలు (లీగల్‌): కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న బోయ రమేష్‌ అభ్యర్థన మేరకు కోర్టు న్యాయం చేసింది. తన కుమారుడిని తమ్ముడు మధు పనికి పంపుతూ చదువుకు దూరం చేస్తున్నాడని, కడపలో ఏదో ఒక పాఠశాలలో చేర్పించాలని కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు కర్నూలు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, ప్రధాన జిల్లా న్యాయమూర్తి జి.కబర్ది సూచనతో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, జిల్లా శిశు సంక్షేమ అధికారులు శనివారం కర్నూలులోని మధు ఇంటికెళ్లి బాలుడిని చేరదీశారు. అనంతరం చిన్నారిని కడప పిల్లల సంక్షేమ కమిటీ అధికారులకు అప్పగించారు.